క్లుప్తంగా

హర్షణీయం



జనగామ రూరల్: పెంచిన వేతనాల కోసం ఎదురు చూస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.100 కోట్ల బడ్జెట్ విడుదల చేయడం హర్షణీయం అని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం అన్నారు. ఈ మేరకు మంగళవారం కార్మిక సంఘ మహిళలు నేటి నుంచి విధుల్లోకి చేరనున్నట్లు డీఈఓ రాముకు జాయినింగ్ లెటర్ అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు ఖలీదా బేగం, భూలక్ష్మి, నాగమ్మ, రేణుక, లక్ష్మి, కవిత, సువర్ణ, సోమలక్ష్మి, యశోధ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని రాజవరం మాజీ సర్పంచ్ బత్తుల సూర్యనారాయణ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని గ్రామానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మంగళవారం సూర్యనారాయణను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మామిడాల లింగారెడ్డి, మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, తాళ్లపల్లి సమ్మయ్య, పాగాల వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన 2002–03 పదో తరగతికి చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మిత్రుడి తండ్రికి ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. తమతో చదువుకున్న అంబదాస్ తండ్రి ఎన్నం సత్తయ్య అనారోగ్యానికి గురికాగా తమ వంతుగా సేకరించిన రూ.20,100 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పెద్దపూడి ప్రసన్నకుమార్, కోశాధికారి చెరుకు సంధ్య, ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీను, సహాయ కార్యదర్శి నర్మెట్ట మమత, అరుణ్‌గోపాల్, షెక్ అక్బర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడికి..

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన ఎండీ వజీర్ కుమారుడు అబ్బు ఆడుకుంటూ వెళ్లి ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల అందించడంతో పాటు ఆస్పత్రికి అయ్యే ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారగోని రవిచంద్ర, పొన్నం కుమారస్వామి, ఉట్కూరి సునయ్,కిషన్‌ప్రసాద్, జక్కం రవి, లింగయ్య, రవితేజ, గుర్రాల రంజిత్ తదితరులు ఉన్నారు.

కోతులను నివారిద్దాం

బచ్చన్నపేట: బండనాగారంలో కోతుల బాధను నివారిద్దామని గ్రామస్తులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం గ్రామస్తులు అలాగే బంజేరు, లక్ష్మాపూర్ గ్రామాల రైతులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానం రాసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల రైతులు ఎకరాకు రూ.400 చెల్లించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. పలు గ్రామాల్లో కోతుల బోన్లను ఏర్పాటు చేసి వాటిని పట్టి డీసీఎంలలో అడవులకు తరలించి వదిలి పెట్టాలని అన్నారు. దీంతో పంటలను ఇబ్బంది లేకుండా పండించుకునే అవకాశం ఉంటుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: మన టీఆర్ఎస్ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడిగా డివిజన్ కేంద్రానికి చెందిన పాదల రత్నాకర్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగపురం నితిన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ టి.శరత్‌బాబు తెలిపారు. ఈమేరకు ఘన్‌పూర్‌లో రత్నాకర్‌కు వారు మంగళవారం నియామకపత్రం అందజేశారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ మన టీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా నియామకం కావడం సంతోషంగా ఉందని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేలా కృషి చేస్తానన్నారు. నియమించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మసాగర్ మండల ఇంఛార్జ్ కందుకూరి రమేష్, వంగ నాగరాజు, నీరటి ప్రవీణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

లింగాలఘణపురం: మండలంలోని జనగామ –సూర్యాపేట రోడ్డులో కుందారం వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నెల్లుట్ల గణేష్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న ఈదునూరి నర్సింహారెడ్డి (56) మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్సై అమరేందర్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి జిల్లా గొలనకొండకు చెందిన నర్సింహారెడ్డి కొంత కాలంగా నెల్లుట్ల టౌన్ షిప్‌లో కుటుంబంతో ఉంటున్నాడు. నర్సింహారెడ్డి తన కుమారుడు సందీప్‌రెడ్డితో కలిసి ఈ నెల 16న ద్విచక్రవాహనంపై కుందారం వైపు వెళ్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను జనగామ ఏరియా ఆస్పత్రికి ఆ తరువాత వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కొలువుదీరిన గణనాథుడు

జనగామ: నాగులకుంటలో..



జనగామ: గణేష్ వాడలో..



నెహ్రూ పార్కు వద్ద వాస్తు గణపతి ఆలయంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లులో..





జనగామ: పట్టణంలోని వాసవీకాలనీ ఫేస్-2 గణేశ్ మండపంలో..



కొడకండ్ల: హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యంలో..

గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వినాయక చతుర్థిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు యువజన సంఘాలు, భక్తులు సోమవారం ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీరొక్కప్రసాదాలతో, అలంకరణలతో లంబోదరుడికి పూజలు చేపట్టారు. దీంతో జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది.

- సాక్షి నెట్‌వర్క్



చిల్పూరు: పూజలో పాల్గొన్న భక్తులు



పాలకుర్తి టౌన్: రాజీవ్ చౌరస్తాలో..



రఘునాథపల్లి: వైశ్యసంఘం నాయకుల పూజలు



స్టేషన్‌ఘన్‌పూర్: ముదిరాజ్ కాలనీలో..



పాలకుర్తి టౌన్: గుడివాడ చౌరస్తాలో..



బచ్చన్నపేటలో..



లింగాలఘణపురంలో..



నర్మెట: వెల్దండలో.. రాక్‌స్టార్ యూత్ సభ్యులు



దేవరుప్పుల బస్టేజీ వద్ద..

శాశ్వత వినాయక మండపం ఏర్పాటు



లింగాలఘణపురం: మండలంలోని చీటూరులో దివంగత ఐలేని లక్ష్మీలక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.1.50 లక్షలతో శివాలయం వద్ద శాశ్వత గణపతి మండపాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా కుమారులు, కోడళ్లు మల్లారెడ్డి కళమ్మ, మహేందర్‌రెడ్డి పారిజాతం, రాంరెడ్డి కవితలకు గ్రామ సర్పంచ్ ఐల మల్లేశం పంచాయితీ పాలక వర్గం పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నిక

పాలకుర్తి: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పాలకుర్తిలో ఏర్పాటు చేసేందుకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పెనుగొండ వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా మేడారపు సుధాకర్, ఉపాధ్యక్షులుగా చిదిరాల ధనుంజయ, బిర్రు సోమేశ్వర్, ఈగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చిలుకమారి సోమేశ్వర్, కార్యదర్శులుగా రాపోలు రాంబాబు, మాచర్ల సత్యనారాయణ, బైరు భార్గవ్, కోశాధికారిగా కామారపు సత్యం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బీటీ రోడ్డు మంజూరు

చిల్పూరు: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కృషి ఫలితంగానే దేవోజీతండాకు బీటీ రోడ్డు మంజూరు అయిందని సర్పంచ్ ఏదునూరి రవీందర్ అన్నారు. లింగంపల్లి పంచాయతీ పరిధిలోని దేవోజీతండాకు ఇటీవల కడియం శ్రీహరి బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయగా మంగళవారం తండాలో సంబురాలు నిర్వహించారు. రవీందర్, సత్తయ్య, రితీష్, సునీత, వేణు, శ్రీను పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన సోనియా రుణం తీర్చుకోవాలి



మాట్లాడుతున్న గిరీష్ చొడాన్‌కార్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ రుణాన్ని ప్రజలు తీర్చుకోవాలని సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులు గిరీష్ చోడాన్‌కార్ అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సముద్రాలలో కాంగ్రెస్ హామీల గ్యారంటీ కార్డులను ఇంటింటా పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. గ్రామంలో తిరుగుతూ కాంగ్రెస్ జయభేరి సభలో సోనియా గాంధీ చేసిన హామీలపై ప్రచారం చేశారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం యువత ఆత్మబలిదానాలు చేసుకుంటున్న విషయం తెలుసుకుని చలించిన సోనియా ఏపీలో కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిసినా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిన దగాకోరు కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. మనం కలలు కన్న తెలంగాణ సాకారానికి రానున్న ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు బస్సిత్ సర్పంచ్ గుండె విమలనర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు జగదీష్‌చందర్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కొడకండ్ల: మండలంలోని మైదంచెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని బడితండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన యువనాయకులు మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి దయాకర్ రావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు వారు తెలిపారు. ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య, సర్పంచ్ మహేష్‌నాయక్, అభిమన్‌గాంధీ, నరేష్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా ‘బిల్లు’

జనగామ: మహిళా సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు వారికి వరంగా మారనుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మహిళా సాధికారతపై ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదన్నారు. జిల్లాలో లక్షలాది మంది మాతృమూర్తులు, సోదరీమణులకు పండుగ రోజు తీపి కబురు ఇచ్చారని, మహిళలందరికీ అభినందనలు తెలిపారు. బల్ల శ్రీనివాస్, కొంతం శ్రీనివాస్, గుజ్జుల నారాయణ, పిట్టల సత్యం ఉన్నారు.

చరిత్రాత్మక నిర్ణయం

దేవరుప్పుల: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఒక చారిత్రాత్మక నిర్ణయమనీ బీజేపీ సీనియర్ నాయకురాలు దుబ్బ లక్ష్మీప్రసన్న రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటులో మహిళలపై భారతీయ జనతా పార్టీకి ఉన్న గౌరవం, చిత్తశుద్ధికి బిల్లు నిదర్శమన్నారు. రాబోయే రోజుల్లో ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయాల్లో సంచలనాత్మకమైన మార్పులతో దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం కానున్నట్టు పేర్కొన్నారు.



జనగామ: మాట్లాడుతున్న బేజాటి బీరప్ప

సహకార సంఘం అధ్యక్షుడిగా రవీందర్



చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలోని శ్రీ మల్లికార్జున స్వామి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఉడుత రవీందర్ గెలుపొందారు. గ్రామంలోని సొసైటీలో మొత్తం 308 మంది సభ్యులుండగా 38 మంది మృతి చెందారు. 272 మందితో ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు జరిగే సమయంలో ఎంపీటీసీ సాదం నర్సింహులు, జక్కుల రాజయ్యలు వేర్వేరు ప్యానల్‌లుగా ఏర్పడడంతో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. మంగళవారం ఎన్నికల అధికారి వేముల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వచారు. ఇందులో జక్కుల రాజయ్య బలపర్చిన ప్యానల్‌లో ఉడత రవీందర్, కరకంటి రాజు, సంగి రాజు, సాదం పరమేష్, సాదం రాజు, సాదం యాదమ్మ, ముడిక రజితలు గెలుపొందారు. వెంటనే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నికను చేతులెత్తే పద్ధతిలో నిర్వహించగా అధ్యక్షుడి రవీందర్, ఉపాధ్యక్షుడు కరకంటివ రాజు ఎన్నిక కాగా, 5 గురు డైరెక్టర్లుగా ఉన్నారు. కాగా, తనకు మద్దతు తెలిపి గెలిపించిన ప్రతీ ఒక్కరికి అధ్యక్షుడు రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

తూతూమంత్రంగా మండలసభ

దేవరుప్పుల: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బస్వ సావిత్రి అధ్యక్షతన ప్రారంభమైన మండల సర్వసభ్య సమావేశానికి సుమారు 22 శాఖల అధికారులు హాజరై సమీక్షించుకోవాల్సి ఉండగా పది మంది మండలస్థాయి అధికారులు హాజరవడంతో తూతూమంత్రంగా కొనసాగింది. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో చోటుచేసుకుంటున్న డొల్లతనాన్ని కనీసం ప్రశ్నించే నాథులు లేక వెలవెలబోయింది. ఇక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అంధకారం చోటుచేసుకుంటే సత్వరమే వీధిలైట్ల నిర్వహణ చేపట్టే పంచాయతీలకకు పవర్ కట్ చేసి జిల్లా యూనిట్‌గా బాధ్యతలు అప్పజెప్పడంతో సదరు అధికారుల స్పందించడం లేదని నీర్మాల సర్పంచ్ మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరికి క్షేత్రస్థాయిలో వీధిలైట్ల నిర్వహణ తీరుతో తాము ఎదుర్కొంటున్న తీరుపై ఫోన్‌లోనే నిలదీయడం గమనార్హం. ఈ సందర్భంగా ఎంపీపీ బస్వ సావిత్రి, జెడ్పీటీసీ పల్ల భార్గవి మాట్లాడుతూ మండల పరిషత్‌కు తగిన నిధులు కేటాయించపోయినప్పటికీ అందుకు నాలుగు రెట్లు నిధులు కేటాయించి సమగ్రాభివృద్ధికి మంత్రి దయాకర్‌రావు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ భార్గవి, వైస్‌ఎంపీపీ విజయ్, ఎంపీడీఓ సురేష్‌కుమార్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షురాలు సుజాత, సర్పంచ్ రమాదేవి పాల్గొన్నారు.



వీధిలైట్ల నిర్వహణపై ఫోన్‌లో నిలదీస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చిల్పూరు: పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి రఘుబాబు అన్నారు. మండలంలోని రాజవరంలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులు, గాలికుంటు నివారణ టీకాలు శిబిరం ఏర్పాటు చేయగా ఎంపీటీసీ మారేపల్లి లలితదేవి ప్రారంభించారు. అనంతరం పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మల్కాపూర్ పశువైద్యాధికారి మూడిక అనేష్, చింతకుంట్ల ఉపేందర్‌రెడ్డి, మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మారేపల్లి కిషన్‌రెడ్డి, సిబ్బందవి రాజేశ్వర్‌రావు, జగ్గమల్, అయాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న రఘుబాబు

స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ

లింగాలఘణపురం: మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని పాఠశాల విద్యార్థులతో నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని షెగ్రిగేషన్ షెడ్ వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. తడిచెత్తతో వర్మికంపోస్టు ఏ విధంగా తయారు చేస్తారో వివరించారు. హెడ్మాస్టర్ మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



లింగాలఘణపురం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాలలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే గ్రామస్తుల చేత, పాఠశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రతతో అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బచ్చన్నపేటలో..

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ఏళ్ల తరబడి పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ కోశాధికారి సుంచు విజేందర్ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ రూరల్/పాలకుర్తి టౌన్/బచ్చన్నపేట/దేవరుప్పుల/: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పలు మండల కేంద్రాల్లో చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం చేపట్టిన దీక్షకు పలువురు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందరర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీ మాదిగల ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యామ్ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం పాలకుర్తి నియజవర్గ అధ్యక్షుడు ఎడవెల్లి సోముమాదిగ ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.

ఆరు పదులు దాటినా పత్రి కోసం తాపత్రయం



గణపతి పత్రి అన్వేషణ బృందం

దేవరుప్పుల: హిందూ సాంప్రదాయ ఆరాధనలో అత్యంత భక్తిపరవసంతో కొలిచే ఆదిదేవుడైన వినాయక చవితిని పురస్కరించుకొని కావాల్సిన పత్రి కోసం ఆరుపదులు దాటినా తాపత్రయం తప్పని పద్మశాలీలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన బిట్ల కొండయ్య, చిలుపురం సోమయ్య, ఏలపాపయ్య, పాము నాగయ్య, చిలుకూరి కొండయ్య తదితరులు మార్కెట్‌లో పూజా సామగ్రి కొనగలికే శక్తి ఉన్న గణపతిని కొలిచేందుకు ప్రకృతి వనంలోనే కావాల్సిన 21 రకాల పత్రులు అనేవి సాధారణమైన ఆకులుగా పరిగణించకుండా మహోత్కృష్టమైన శక్తివంతమైన ఔషధులుగా ప్రాధాన్యత ఉంది. వాటితో పూజలు చేయడం వల్ల మనుషుల్లో ఉండే అనారోగ్యాల్ని హరించేస్తుందనే నమ్మకం. ఇలాంటి విశిష్టత కలిగిన పత్రి తేవాలనే సెంటిమెంటు కొనసాగించేలా నేటి యువతనువెంట వేసుకొని నాలుగైదు కిలోమీటర్ల మేర తిరిగి సేకరించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి తోడు యాంత్రీకరణ జీవన విధానాలు పెరిగిన తరుణంలో రసాయనిక పదార్థాలతో తయారైన విగ్రహాల జోలికిపోకుండా మట్టితోనే విగ్రహాలు చేసి కొలవడం వీరికి పర్యావరణ పరిరక్షణపై ప్రేమకు అద్దం పడుతోంది.

సంక్షిప్త సమాచారం

తల్లిపాలే శిశువుకు శ్రేష్టం

చిల్పూరు: తల్లిపాలే శిశువుకు శ్రేష్టమని ఐసీడీఎస్ సీడీపీఓ ఫ్లోరెన్స్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి మండల సూపర్ వైజర్ దూలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కోనాయిచలం, కేజీతండా గ్రామాల్లోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు వీణారాణి, ఉపేంద్ర, గీతారాణి, సునిత, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

దేవరుప్పుల: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నిరీక్షణతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నేడు పాలకుర్తిలో చేపట్టే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం రాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండలం కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పందేనబోయిన మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ రమేష్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు భరత్ గౌడ్, మండల యూత్ ఉపాధ్యక్షులు మహమ్మద్ యాకూబ్ పాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కడియంను కలిసిన నరేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చింతకుంట్ల నరేందర్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డికి కడియం పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అనాథ పిల్లలను ఆదుకునేందుకు కృషి

జఫర్‌గఢ్: రాష్ట్రంలో ఉన్న అనాథ పిల్లలను అన్ని విధాల ఆదుకునేందుకు గాను సీఎం కేసీఆర్ త్వరలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేర్కొన్నారు. రేగడితండా గ్రామశివారు టీబీతండా వద్ద ఉన్న మా ఇల్లు అనాథ ఆశ్రమంలో మంగళవారం రాత్రి జరిగిన బీఆర్ఎస్ నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకులు, అనాథ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ అందజేత

బచ్చన్నపేట: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో హనుమాన్ ఆలయ పునర్ నిర్మాణానికి రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి సహకరిస్తానని తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన వ్యక్తులు వెళ్లి అడుగగా ఆలయ స్లాబ్ నిర్మాణానికి అవసరమైన సిమెంటు బస్తాలకు డబ్బును చెక్కు రూపంలో అందజేశారు. శశిధర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, సాయికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.